## ఆఖరి మజిలీ

జీవన సంబంధాలన్నీ వ్యాపార సంబంధాలే కనుక
ఆత్మ ప్రకంపనాలన్నీ దాని చుట్టూనే
రోజువారీ జీవితానికి వీడ్కోలిచ్చినప్పటి నుంచి
ఏ రాత్రయినా చెట్టుకొక్క పిట్టలాగానే.
అరిచినా రెక్కలల్లార్చినా
భయం భయంగా నిశ్శబ్దంగానే
చీకటిలో ఏదోమూల
వేకువ కోసం ఒళ్లంతా కళ్లే.

గూడుకు ప్రాణమిచ్చింది గోడలే అయినా
ముద్రపడేది తెలియకూడని మూడోకంటిగానే.
వేలవేల క్షణాల విశ్రాంతిలో వేయిపడగల అశాంతి?
ఏ క్షణం ఏమౌతుందోనని
వెలుతురొచ్చేసరికి తొందరతొందరగా
అందర్నీ చేరాలన్న తపనే.
మసక వెలుతురులో కళ్లు పొడుచుకోక ముందే
కనపడ్డవారందరితో మునిగి తేలేది నిన్నటిలోనే.
రెక్కాడక పోయినా డొక్కాడేందుకు దొరికే
చిరుప్రసాదం కోసం
ఏ రోజుకారోజు కసిరే పూజారింకా రాకముందే
గుడిమెట్లమీద గంటలకొద్దీ పాతమిత్రులతో పరవళ్లే
జీవితానుభవ విస్తీర్ణంలో సుఖదుఃఖాల బేరీజులే.

తెలిసిన పద్దుల్లో
అలారం మోగకుండానే ఆగిపోయినవెన్నో

మోగుతున్నవి ఆగిపోవాలని చూస్తున్నవెన్నో
పచ్చగా ఉన్న చెట్లెన్నో మోడైపోయిన వెన్నో
సేకరించిన లెక్కలు
బహిర్గతం కాని దిగుళ్లు
ఎదురు తిరుగుతున్న ఆనవాళ్లు
ఎప్పటికప్పుడు తాజాగా గుచ్చుకుంటున్న ముళ్లు
అన్నీ కలగలిపి కెలుక్కుంటూ కెలుక్కుంటూ
రాత్రంతా మళ్లీ చెట్టుకొక్క పిట్టలాగానే.